క్లుప్తంగా

ప్రతి ఒక్కరూ సేవాగుణం అలవర్చుకోవాలి



అనాథ బాలలకు స్వీట్లు పంపిణీ చేస్తున్న డెమొక్రటిక్ పీఆర్‌టీయూ ప్రతినిధులు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): ప్రకృతి నుంచే ప్రతి మనిషీ సేవా గుణం అలవరుచుకోవాలని, సాటి మనిషిగా తోటి మానవుల పట్ల మనకు ఇంకా బాధ్యత పెరగాలని డెమొక్రటిక్ పీఆర్‌టీయూ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు డీ. శ్రీను, పీ. వెంకటేశ్వర రావు, రాష్ట్ర బాధ్యులు మరడాని అచ్యుతరావు పిలుపునిచ్చారు. డెమొక్రటిక్ పీఆర్‌టీయూ సేవాదళ్ ఆధ్వర్యంలో శుక్రవారం నగరంలోని విహాన్ ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బాలుర చిల్డ్రన్ హోమ్‌కు స్వీట్లు, 50 కిలోల బియ్యం అందచేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దాతలు ముందుకువచ్చి ఎదో ఒక రూపంలో సహాయం చేస్తే చిన్నారులు ఉన్నత స్థానాలకు ఎదుగుతారన్నారు. అవసరానికి ఆదుకున్నప్పుడే మానవత్వం ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో డెమొక్రటిక్ పీఆర్‌టీయూ సేవాదళ్ కార్యకర్తలు, పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

18 నుంచి దెందులూరు రైల్వే గేటు మూసివేత

ఏలూరు (టూటౌన్) : ఏలూరు-దెందులూరు రైల్వే స్టేషన్‌ల మధ్య స్థానిక నిమ్మకాయల మార్కెట్ యార్డు సమీపంలో ఉన్న రైల్వే గేటును ఈనెల 13వ తేదీ ఉదయం 7 గంటల నుంచి 18వ తేదీ సాయంత్ర 5 గంటల వరకూ మూసివేయనున్నట్లు దక్షిణమధ్య రైల్వే ఏలూరు సీనియర్ సెక్షన్ ఇంజనీర్ కె.వెంకటేశ్వరరావు ఒక ప్రకటనలో తెలియజేసారు. ఈ మార్గం గుండా ప్రయాణించే వాహనదారులు, నిమ్మకాయల మార్కెట్లకు తమ ఉత్పత్తులను తీసుకు వచ్చే రైతులు ప్రత్యామ్నాయ మార్గం గుండా వెళ్లాల్సిందిగా కోరారు.

టోల్ గేట్ వద్ద వాహనాల తనిఖీ

పెదపాడు: శాసన మండలి ఎన్నికల నేపథ్యంలో పెదపాడు పోలీసులు శుక్రవారం వాహన తనిఖీలు చేపట్టారు. జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పెదపాడు మండలంలోని కలపర్రు టోల్‌గేట్ వద్ద వాహన తనిఖీలు చేపట్టారు. ఎన్నికల నేపథ్యంలో ఎవరైనా నగదు రవాణా చేస్తే సంబంధిత నగదుకు ఆధారా చూపించాలన్నారు. ఓటర్లను ప్రలోభ పెట్టేందుకు నగదు, మద్యం, ఏ ఇతర వనులు సరఫరా చేయరాదన్నారు. అలా ఎవరైనా సరఫరా చేస్తే ఎన్నికల చట్టం ప్రకారం కేసు నమోదు చేస్తామని పోలీసలు హెచ్చరించారు.

తల్లీబిడ్డా రక్షణకు 'కిల్కారీ' సేవలు

- కొత్త కార్యక్రమానికి కేంద్రం రూపకల్పన
- శిక్షణ పొందుతున్న ఆరోగ్య, ఆశ కార్యకర్తలు

ఏలూరు టౌన్ : మాతాశిశు సంరక్షణ లక్ష్యంగా కిల్కారీ పేరుతో కేంద్ర ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ కొత్త కార్యక్రమానికి రూపకల్పన చేసింది. గర్భిణులు, బాలింతలు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పాటించాల్సిన ఆరోగ్య నియమాలు, వైద్య పరీక్షలు తదితర అంశాలపై వారిని అప్రమత్తం చేసేందుకు దీనిని అందుబాటులోకి తెచ్చారు. ఈ విధానంపై ప్రభుత్వం ఆరోగ్య, ఆశ కార్యకర్తలకు శిక్షణ, అవగాహన కార్యక్రమాలు జరుగుతున్నాయి.

ఇదీ పరిస్థితి...హాలో..అక్కా నేను మీ డాక్టర్‌ను మాట్లాడుతున్నారు. మీ ఆరోగ్యం ఎలా ఉంది? అనే అప్యాయమైన పలకరింపుతో గర్భిణులు, బాలింతలకు ఫోన్లు వస్తుంటాయి. గర్భిణులు, బాలింతలు ఆరోగ్య కార్యకర్తలు, ఆశ వర్కర్ల వద్దకు వెళితే పేరు, వయసు, ఇంటి చిరునామా, సెల్‌ఫోన్ నంబర్ అంచనా ప్రసవ తేదీ వంటి వివరాలను ప్రభుత్వ ఆర్సీహెచ్ రిజిస్టర్‌లో నమోదు చేస్తారు. గర్భం ధరించిన మహిళ నాలుగో నెల ప్రారంభం నుంచి కిల్కారీ



పీహెచ్‌సీలో గర్భిణులను పరీక్షిస్తున్న వైద్యులు

సేవలు(ప్రతి తల్లీ ఆరోగ్య స్వీయ ఆరోగ్యసేవ) ప్రారంభమవుతాయి. గర్భిణి చెప్పే సమాధానాల ఆధారంగా ఆరోగ్య సమాచారాన్ని సేకరిస్తారు. కరోనా సమయంలో తర్వాత తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సరైన అవగాహన లేక కొన్ని మాత మరణాలు సంభవించాయి. మరికొందరు పౌష్టికాహారం, రక్తహీనత లోపాలతో మృత్యువాత పడుతున్నారు. ఇకపై ఇలాంటి సమస్యలకు చెక్ పెడుతూ ప్రభుత్వం ఈ విధానాన్ని అమలులోకి తెచ్చింది.

72వారాల పాటు సేవలు

గర్భిణీగా నమోదైన రెండో త్రైమాసికం నుంచి పిల్లలు పుట్టిన ఏడాది వరకూ ఏయే వారంలో ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో వివరించే ఆరోగ్య సమాచారంతో 72వారాల పాటు వారానికి ఒక ఆడియో చొప్పున వాయిస్ రూపంలో అందుబాటులోకి తీసుకువస్తారు. ఫలితంగా మాతా, శిశు మరణాలు తగ్గడంతో పాటు సురక్షిత ప్రసవాలకు అవకాశం ఉంటుంది.

గర్భిణిగా నిర్ధారణ అయినపుడే



గర్భిణీగా నమోదైనపుడే ఆరోగ్య కార్యకర్త వారి ఫోన్ నంబర్ తీసుకుంటారు. వారికి నేరుగా మహిళా డాక్టర్ నుంచి ఫోన్ వస్తుంది. తమకు అందించిన వివరాల ప్రకారం తీసుకోవాల్సిన జాగ్రత్తలు, చేయించుకోవాల్సిన వైద్యం గురించి వైద్యుడు వివరిస్తారు. డాక్టర్ ఫోన్ చేసినపుడు గర్భిణి మాట్లాడడం కుదరకపోతే తిరిగి అదే నంబర్‌కు గర్భిణి ఫోన్ చేసి వివరాలు తెలుసుకునేలా ఈ విధానాన్ని రూపొందించారు. గర్భిణికి ఆండ్రాయిడ్ ఫోనే కాదు కీ ప్యాడ్ ఉన్నా సరిపోతుంది.

డాక్టర్ నాగేంద్ర, పీహెచ్‌సీ వైద్యులు

కన్నయ్య గుట్ట నిర్వాసితులకు సత్యసాయి సేవా సంస్థల సహాయం



కన్నయ్య గుట్ట నిర్వాసితులకు ట్రంకుపెట్టెలు, బియ్యం డబ్బాలు పంపిణీ చేస్తున్న శ్రీ సత్యసాయి సేవా సంస్థ ప్రతినిధులు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట) : ఇటీవల వేలేరుపాడు మండం కన్నయ్య గుట్ట గ్రామంలో అగ్నిప్రమాదం సంభవించడంతో కట్టుబట్టలతో మిగిలిన నిర్వాసితులను శ్రీ సత్యసాయి సేవా సంస్థల ప్రతినిధులు శుక్రవారం కలిసి వివిధ రూపాల్లో సహాయం చేసినట్లు ఆ సంస్థ జిల్లా అధ్యక్షుడు కానుమిల్లి శశిశేఖరరావు ఏలూరులో ఒక ప్రకటనలో తెలిపారు. అగ్నిప్రమాదంలో సర్వం కోల్పోయిన 27 కుటుంబాలకు నూతన వస్త్రాలతో పాటు ట్రంకుపెట్టెలు, బియ్యపు డబ్బాలు, వంట పాత్రలు అందజేశామన్నారు. ఈ కార్యక్రమంలో తమ సేవా సంస్థ ప్రతినిధులు ఎంవీఎస్ ధర్మారావు, పెద్దిరెడ్డి మూర్తి తదితరులు పాల్గొన్నారని తెలిపారు.

నులిపురుగుల నివారణపై అవగాహన పెంచాలి

ఏలూరు రూరల్ : జిల్లా కలెక్టర్ వై ప్రసన్నవెంకటేష్ ఆదేశాలు అనుసరించి నులిపురుగులు నివారణపై సోషల్ మీడియా ద్వారా పిల్లలు, తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని ఎంపీడీఓ బి ప్రణవి అన్నారు. జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా శుక్రవారం ఏలూరు మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో వైద్య, విద్యాశాఖ, పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం ఆదేశాల మేరకు మార్చి 14న నులిపురుగుల నివారణ కార్యక్రమం నిర్వహించాలన్నారు. ఎంఈఓ సబ్బిత నరసింహమూర్తి మాట్లాడుతూ ఇప్పటికే ఉపాధ్యాయులు అందరికీ ఆదేశాల ఇచ్చామన్నారు. ఉపాధ్యాయులు పిల్లలకు భోజనం అనంతరం టాబ్లెట్స్ వేస్తారన్నారు. దీనిపై స్పందించిన



అధికారులతో సమావేశం నిర్వహించిన ఎంపీడీవో ప్రణవి

ఎంపీడీఓ వాట్సప్ ద్వారా నులిపురుగులు నివారణపై అవగాహన పెంచాలన్నారు. దీని కోసం ముద్రించిన బుక్లెట్ అందరికీ పంపిణీ చేయాలని ఎంపీడీవో కార్యదర్శులను ఆదేశించారు. సమావేశంలో ఈఓపీఆర్డీ ఎం సరళకుమారితో పాటు పలువురు కార్యదర్శులు పాల్గొన్నారు.

సావిత్రిబాయి పూలే సేవలు మరువలేనివి

ఏలూరు (టూటౌన్) : దేశ తొలి మహిళా ఉపాధ్యాయురాలు, సామాజిక ఉద్యమకారిణి సావిత్రిబాయి పూలే 126వ వర్ధంతి సందర్భంగా ఆమెకు వివిధ సంఘాల ఆధ్వర్యంలో ఘన నివాళులర్పించారు. స్థానిక నరసింహారావుపేటలోని ఏఐఏవైఎస్ రాష్ట్ర కార్యాలయంలో సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి డా.మెండెం సంతోష్ కుమార్ ఆధ్వర్యంలో పూలే వర్ధంతి కార్యక్రమం జరిగింది.

ముందుగా ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం సంతోష్‌కుమార్ మాట్లాడుతూ సావిత్రిబాయి పూలే మొట్టమొదటిగా 1848లో మొట్టమొదటిగా బాలికల పాఠశాలను పూణేలో ప్రారంభించారన్నారు. 1852లో మహిళా సేవా మండల్ పేరిట మహిళా సంఘాన్ని ప్రారంభించారన్నారు. 1873లో సత్యశోధక్ సమాజ్ ప్రారంభించి వితంతు పునర్వివాహాలు, బాల్యవివాహాలు, మూఢ నమ్మకాలు, సతీసహగమనానికి వ్యతిరేకంగా పోరాటాలు చేసారని గుర్తు చేశారు. కులవ్యవస్థ, అంటరాని తనంపై తన భర్త జ్యోతిరావుపూలేతో కలిసి సామాజిక ఉద్యమాలు నిర్వహించారన్నారు. ఈమె పోరాటాలనుల ఆదర్శంగా తీసుకొని ప్రజలు చైతన్య వంతులు కావాలన్నారు. ఈ కార్యక్రమంలో కొరబండి బాబూరావు, పల్లా యేసేబు, కె.రవిప్రసాద్, కె.రాజు, రమ్య, నాగ భవాణి తదితరులు పాల్గొన్నారు.



ఏఐఏవైఎస్ రాష్ట్ర కార్యాలయంలో సావిత్రిబాయి పూలేకు నివాళులర్పిస్తున్న నాయకులు

కరుణోదయ విభిన్న ప్రతిభావంతుల పాఠశాల ఆధ్వర్యంలో..

స్థానిక ఎస్ఆర్‌పేట జాన్ వీధిలోని జీవధార బుక్ సెంటర్‌లో కరుణోదయ విభిన్న ప్రతిభావంతుల పాఠశాల ఆధ్వర్యంలో చైర్మన్ కలతోటి హెన్రీ డోమినిక్ ఆధ్వర్యంలో చదువుల తల్లి సావిత్రిబాయి పూలే వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిధిగా పాల్గొన్న అబ్రహాం మాష్టారు మాట్లాడుతూ పీడిత ప్రజలు ముఖ్యంగా స్త్రీల అభివృద్ధికి కృషి చేసిన గొప్పసంఘ సంస్కర్త సావిత్రిబాయి పూలే అని కొనియాడారు. అనంతరం డోమినిక్ మాట్లాడుతూ ఆధునిక భారత దేశంలో స్త్రీల విద్యాభివృద్ధికి, సమాజంలో అసమానతల మీద అలుపెరుగని పోరాటం చేసి మహిళల హక్కుల కోసం కృషి చేసిన తొలితరం మహిళా ఉద్యమ కారిణి సావిత్రిబాయి పూలే అన్నారు. ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ కమిటీ జిల్లా సభ్యులు మేతర అజయ్ బాబు మాట్లాడుతూ విద్య ద్వారానే స్త్రీ విముక్తి అని భావించిన సావిత్రి బాయి పూలే సమాజంలో స్త్రీలు అన్ని రంగాల్లో అత్యున్నత స్థానంలో నిలవాలనే సంకల్పంతో పాఠశాలను ప్రారంభించారన్నారు. కవి సున్నా అంజారావు, జీవధార సంస్థ అధినేత విజయ్ కుమార్, వైకె గ్రాఫిక్స్ డేవిడ్ రాజు, ఇస్సాకు, మోహనరావు, అరుణ, జ్యోతి, రమాదేవి, ఝాన్సీ పాల్గొన్నారు.

శాస్త్రవేత్తల క్షేత్ర పరిశీలన

దెందులూరు: వరిలో ద్రవ రూప జీవన ఎరువులపై రైతులు వ్యవసాయ శాఖ సలహాలు, సూచనలు పాటించాలని ఏరువాక కేంద్రం శాస్త్రవేత్తలు డాక్టర్ ఫణికుమార్, ఎన్.నాగేంద్రబాబు అన్నారు. శుక్రవారం ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ కళాశాల విద్యార్థినులు డీ. భావన, ఎం.శ్వేత, పీ.ప్రమీల, ఎం.లక్ష్మి ఆధ్వర్యంలో ఏరువాక కేంద్రం శాస్త్రవేత్తలు క్షేత్ర పరిశీలన చేశారు. ద్రవ రూప జీవన ఎరువులు వేసిన ఎంటీయూ 1121 రకంలో పంట పెరుగుదలను గమనించాలన్నారు. అనంతరం వరి సాగు ఎరువులు, పురుగు మందుల వాడకం, భూసార పరిరక్షణ, వ్యవసాయ శాఖ సలహాలు, సూచనలను అందించారు.



దెందులూరు పొలంలో క్షేత్ర పరిశీలన చేస్తున్న శాస్త్రవేత్తలు, శిక్షణ పొందుతున్న విద్యార్థులు

గ్రామ పంచాయతీకి ట్రాక్టర్ వితరణ

దెందులూరు: గ్రామ శ్రేయస్సు కోసం గ్రామానికి చెందిన దాత పీ.రామ్మోహనరావు (బుజ్జి) కొత్త ట్రాక్టర్ ఇవ్వడం అభినందనీయమని ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి అన్నారు. శుక్రవారం దాత రామ్మోహనరావు గ్రామ పంచాయతీలో చెత్తను తీసుకువెళ్లేందుకు కొత్త ట్రాక్టర్‌ను పంచాయతీకి ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి చేతులు మీదుగా బహూకరించారు. జెడ్పీటీసీ నిట్టా లీలానవకాంతం, ఎంపీపీ బొమ్మనబోయిన సుమలత, వైస్ ఎంపీపీ వేమూరి జితేంద్ర, పార్టీ మండల అధ్యక్షుడు కామిరెడ్డి నాని, సర్పంచ్ కోటే నాగమల్లేశ్వరి కుమార్, ఎంపీటీసీలు ఏనుగు అంజలి ప్రసాద్, సువ్వా ప్రభుదాసు, పార్టీ నాయకులు కొండేటి గంగాధర్‌బాబు, తోట పద్మారావు, మోర్ల సుబ్బారావు, గ్రామ కార్యదర్శి యోహోషువా దాతను అభినందించి సత్కరించారు. అనంతరం మసీదుపాడులోని జగనన్న కాలనీని ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి పరిశీలించారు. త్వరితగతిన ప్రారంభించిన ఇళ్లు పూర్తి చేయాలని లబ్ధిదారులకు సూచించారు. లబ్ధిదారులకు నూతన వస్త్రాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు.



గోపన్నపాలెం పంచాయతీకి ట్రాక్టర్ ఇచ్చిన దాత రామ్మోహనరావును అభినందిస్తున్న ఎమ్మెల్యే

పార్టీ ఆవిర్భావ దినోత్సవం వైభవంగా నిర్వహించాలి

దెందులూరు: నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఈ నెల 12న విధిగా నిర్వహించాలని నాలుగు మండలాల పార్టీ అధ్యక్షులు, ముఖ్యనాయకులను, ప్రజాప్రతినిధులను ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి ఆదేశించారు. శుక్రవారం రాత్రి ఎమ్మెల్యే కార్యాలయంలో నియోజకవర్గ ప్రజాప్రతినిధుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి మాట్లాడుతూ నాలుగు మండలాల పార్టీ అధ్యక్షులకు జెడ్పీటీసీలు, ఎంపీటీసీలు, ఎంపీపీలు, వైస్ ఎంపీపీలు పూర్తి సహాయ సహకారాలు అందించాలన్నారు. 12న పార్టీ ఆవిర్భావ దినోత్సవం నియోజకవర్గంలో ప్రతి గ్రామ శివారు ప్రాంతాల్లో విధిగా ఆవిర్భావ దినోత్సవం ఎన్నికల నిబంధనలకు లోబడి నిర్వహించాలన్నారు. ఆవిర్భావ దినోత్సవం విధిగా నిర్వహించడానికి మండల పార్టీ అధ్యక్షులు, గ్రామ పార్టీ అధ్యక్షుల సమన్వయంతో నిర్వహించాలన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి త్వరలో దెందులూరు నియోజకవర్గంలో రోడ్లు, లిఫ్ట్ ఇరిగేషన్, వైద్యశాల, ఇతర అభివృద్ధి పనుల నిమిత్తం విచ్చేస్తారన్నారు. నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధుల సమన్వయంతో ఆవిర్భావ దినోత్సవం, పార్టీ కమిటీల నియామకంలో చిత్తశుద్ధి, ప్రణాళికతో పనిచేయాలన్నారు. సమావేశంలో వైఎస్సార్ సీపీ జిల్లా అధికార ప్రతినిధి జానంపేట బాబు, విజయవాడ కనకదుర్గమ్మ అమ్మవారి ఆలయ ట్రస్టు బోర్డు డైరెక్టర్ తొత్తడి వేదకుమారి, జెడ్పీ వైస్ చైర్మన్ పెనుమాల విజయ్ బాబు, దెందులూరు మాజీ ఏఎంసీ చైర్మన్ మేకా లక్ష్మణరావు, జెడ్పీటీసీలు నిట్టా లీలానవకాంతం, గంటా పద్మశ్రీ, మండలి సరస్వతి, ఎంపీపీలు తాతా రమ్య, బొమ్మనబోయిన సుమలత, బత్తుల రత్నకుమారి, పెన్మెత్స శ్రీనివాస్, రాష్ట్ర కార్పొరేషన్ డైరెక్టర్లు పశ్చిం ప్రసాద్, ముదునూరి సూర్యనారాయణ, ప్రభాకరరావు, మండలి కొండలరావు, నాలుగు మండలాల పార్టీ అధ్యక్షుడు కామిరెడ్డి నాని, తేరా ఆనంద్, మెట్లపల్లి సూరిబాబు, అప్పన ప్రసాద్, నియోజకవర్గంలో ముఖ్య నాయకులు పాల్గొన్నారు.



దెందులూరులో నియోజకవర్గం నాయకులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర	కూరగాయలు	కిలో ధర
టమాటాలు	24	అరటి కాయ (1)	05-07
వంకాయలు (గులాబీ)	30	చిక్కుడు కాయలు	56
వంకాయలు (కాంతులు)	40	చామదుంపలు	72
వంకాయలు (తెలుపు)	34	ములక్కాడలు	50
బెండకాయలు	54	కంద	12
పచ్చిమిర్చి	30	బీట్‌రూట్	36
కాకర కాయలు	28-32	కీరా దోస	40
బీరకాయలు	40	ఫ్రెంచ్‌బీన్స్	96
బీరకాయలు (పందిరి)	54	అల్లం	70
క్యాబేజీ	18	కొత్తిమీర (కట్ట)	13
క్యారెట్	32	పాలకూర	10
దొండకాయలు	44	చుక్కకూర	10
బంగాళదుంపలు	18	తోటకూర	10
ఉల్లిపాయలు	18-20	గోంగూర	07
గోరుచిక్కుడు	46	పుదీనా	05
దోసకాయలు	36-48	బఠాణీ	56
ఆనబకాయ (1)	25	క్యాప్సికమ్	66
పొట్లకాయ(1)	20	చిలకడదుంప	28

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా విజయవాడ (ఇంద్ర)	21.00	15
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం (ఇంద్ర)	21.00	30
ఏలూరు - బీహెచ్‌ఈఎల్ (అమరావతి)	22.00	37
ఏలూరు - తిరుపతి(ఇంద్ర)	19.00	26

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్‌ఈఎల్	21.45	4820	17
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా కే.కోట	19.30	4796	21
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా రామచంద్రపురం	19.45	4798	18
ఏలూరు -జీడిమెట్ల వయా ఖమ్మం	20.15	4802	20
ఏలూరు -ఈసీఐఎల్	22.30	4814	10
ఏలూరు - బీహెచ్‌ఈఎల్	22.15	34820	18
ఏలూరు -బీహెచ్‌ఈఎల్	09.00	4794	34
ఏలూరు - విశాఖపట్నం	12.00	4840	34
ఏలూరు -విశాఖపట్నం	22.00	4838	33
ఏలూరు - తిరుపతి	16.00	4830	33

వాహనాల తనిఖీ



ద్వారకాతిరుమల మండలం లక్ష్మీనగర్ వద్ద కారును తనిఖీ చేస్తున్న పోలీసులు

ద్వారకాతిరుమల: ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో మండలంలోని లక్ష్మీనగర్ జాతీయ రహదారిపై పోలీసులు శుక్రవారం చెక్‌పోస్టును ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ద్వారకాతిరుమల ఎస్సై టి.సుధీర్, సిబ్బంది కలసి పలు వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. డబ్బు, మద్యం వంటివి తరలిస్తూ పట్టుబడితే కఠిన చర్యలు చేపడతామన్నారు.

పోరాడే తత్వం పెంపొందించుకోవాలి

కొయ్యలగూడెం: విద్యార్థి దశలోనే బాలికలు స్త్రీల హక్కులపై అవగాహన కలిగి ఉండాలని ప్రముఖ న్యాయవాది అచ్యుత శ్రీనివాసరావు పేర్కొన్నారు. మహిళా సాధికారిక వారోత్సవాలను పురస్కరించుకొని శుక్రవారం పరింపూడి బాలికల ఉన్నత పాఠశాలలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన ప్రభుత్వాలు మహిళలకు కల్పిస్తున్న ప్రత్యేక హక్కులు, చట్టాలు తెలుసుకోకపోవడం వల్ల న్యాయం పొందలేకపోతున్నారని అదే సమయంలో అన్యాయానికి గురవుతున్నారన్నారు. బాలికలపై లైంగిక వేధింపులు, మహిళలపై అఘాయిత్యాలు కొనసాగుతున్న నేపథ్యంలో హత్యాచారాల చట్టాలను కఠినంగా అమలు చేయాలంటే పోరాడే తత్వం పెంపొందించుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా సహచర మహిళ న్యాయవాదులు ప్రసంగించారు. పాఠశాల హెచ్‌ఎం డి.శ్రీలత న్యాయవాదులు మేకల రామమోహన్రావు, పి.పెద్దిరాజు, బండారు లతా కుమారి, బల్లి సాయికుమారి, కాకి జెస్సీ, తొర్లపాటి శ్రీనివాస్, టి రాము, తోట పద్మిని పాల్గొన్నారు.



కొయ్యలగూడెం బాలిక ఉన్నత పాఠశాలలో మాట్లాడుతున్న న్యాయవాది అచ్యుత్ శ్రీనివాస్

జగనన్న కాలనీకి విద్యుత్ సౌకర్యం



అలుగులగూడెం జగనన్న కాలనీకి విద్యుత్ స్తంభాలు, కరెంటు సౌకర్యం కల్పిస్తున్న దృశ్యం

దెందులూరు: అలుగులగూడెంలో జగనన్న కాలనీలో ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి ఆదేశాల మేరకు యుద్ధప్రాతిపదికన విద్యుత్ స్తంభాలు, విద్యుత్ సౌకర్యం ఏర్పాటు చేస్తున్నారు. పనులను దెందులూరు మండల పార్టీ అధ్యక్షుడు కామిరెడ్డి నాని, వైఎస్సార్ సీపీ గ్రామ దెందులూరు అధ్యక్షుడు పోకల రాంబాబు, అలుగులగూడెం వార్డు మెంబరు కాండ్రు ప్రసన్న, వైఎస్సార్ సీపీ నాయకులు రవి, స్థానిక నాయకులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా జగనన్న ఇళ్లు త్వరితగతిన పూర్తి చేయాలని, కాలనీలోని లబ్ధిదారులకు రోడ్లు, తాగునీరు, విద్యుత్ సౌకర్యం కల్పిస్తామని పోకల రాంబాబు వివరించారు.

సీహెచ్‌సీలో ఆకస్మిక తనిఖీ

దెందులూరు: దెందులూరు కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌ను శుక్రవారం డీసీహెచ్‌ఎస్ డాక్టర్ ఏవీఆర్ మోహన్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. వైద్యశాలలో పనిచేసే వైద్యులు సాయంత్రం నుంచి రాత్రి వేళల్లో విధులు నిర్వహించడంలేదని గతంలో ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి ఆగ్రహం వ్యక్తం చేసి డీఎంఅండ్‌హెచ్‌ఓ, కలెక్టర్‌కు తెలిపిన సంగతి విదితమే. ఇటీవల వైద్యులు రాత్రివేళల్లో విధులకు రావడం లేదని, స్టాఫ్ నర్సులు మాత్రమే ఉంటున్నారని గ్రామస్తులు తెలిపారు. ఈ నేపథ్యంలో డీసీహెచ్‌ఎస్ డాక్టర్ ఏవీఆర్ మోహన్ వైద్యులు, వైద్యశాలలో సిబ్బంది, హాజరు శాతం, వైద్యపరికరాలు, నూతన సీహెచ్‌సీ భవనాన్ని పరిశీలించారు.

సమస్యల పరిష్కారానికి కృషి

దెందులూరు: వెలమ సంఘ సమస్యలు పరిష్కారానికి తన వంతు పూర్తి సహాయ సహకారాలు అందిస్తానని ఏలూరు ఎంపీ కోటగిరి శ్రీధర్ అన్నారు. శుక్రవారం ఎంపీ కార్యాలయంలో చింతలపూడి నియోజకవర్గ వెలమ సంఘ నాయకులు వైఎస్సార్ సీపీ నాయకులు రాజేష్ ఆధ్వర్యంలో ఎంపీని కలిశారు. వెలమలు, సంఘ సమస్యలు వివరించారు. ఎంపీ మాట్లాడుతూ ప్రాధాన్యతా క్రమంలో సమస్యలను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు.



ఎంపీ కార్యాలయంలో ఎంపీ కోటగిరి శ్రీధర్‌ను కలిసి మాట్లాడుతున్న వెలమ సంఘ నేతలు

కడుపు నొప్పి తాళలేక ఇద్దరు ఆత్మహత్య

దెందులూరు: కడుపునొప్పి తాళలేక ఇద్దరు ఆత్మహత్య చేసుకుని మృతి చెందారని దెందులూరు ఎస్సై ఐ.వీర్రాజు తెలిపారు. కొవ్వలి గ్రామంలో కొమ్మన్నవారితోట సచివాలయం-1 వలంటీర్ మన్నే రాము (27) కడుపునొప్పి తాళలేక శుక్రవారం ఇంట్లో ఫ్యాన్‌కి ఉరి వేసుకున్నాడన్నారు. ఇది గమనించిన కుటుంబ సభ్యులు, స్థానికులు రామును ప్రభుత్వాసుపత్రికి తీసుకువెళ్లడంతో అప్పటికే మరణించినట్టు వైద్యులు చెప్పారు. మృతి చెందిన వలంటీర్ మన్నే రాముకు ఆదివారం వివాహం జరగాల్సి ఉంది. మసీదుపాడు గ్రామానికి చెందిన సాయిబోయి కృష్ణమోహన్ (35) కడుపునొప్పి తాళలేక ఉరి వేసుకుని శుక్రవారం సాయంత్రం మృతి చెందాడన్నారు. కేసు నమోదు చేశామని ఎస్సై తెలిపారు.